





మెగా డీఎస్సీకి.. గ్రీన్ సిగ్నల్

- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో మొత్తం 324 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు
- బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు సుమారు10 వేలకు పైగానే..
- ఏజెన్సీ డీఎస్సీపై మళ్లీ ఊసెత్తని ప్రభుత్వం
- టీచర్ కొలువుపై నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో ఒకే ఒకసారి 2017లో నిర్వహణ
- తాజాగా అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే మెగా డీఎస్సీకి కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చజెండా
- జిల్లావ్యాప్తంగా మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 698 ఉండగా.. ప్రాథమిక పాఠశాలలు 500, ప్రాథమికోన్నత 93, ఉన్నత పాఠశాలలు 105


ఆదిలాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. సుమారుగా ఏడేళ్ల తర్వాత నిర్వహించే డీఎస్సీపై నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం హడావుడిగా విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ.. దాని స్థానంలోనే కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేశారు. గత కొద్దిరోజులుగా ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ రానే వచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించింది. జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 698 ఉండగా ఇందులో ప్రాథమిక పాఠశాలలు 500, ప్రాథమికోన్నత పాఠశాలలు 93, ఉన్నత పాఠశాలలు 105 ఉన్నాయి. జిల్లాకు 2758 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 2299 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి 459 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉండగా ప్రభుత్వం తాజాగా 324 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అయితే అధికారంలోకి వచ్చిన మూడు మాసాల్లోనే ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 2024 డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో మొత్తం 324 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే బీఎడ్, డీఎడ్‌ను పూర్తి చేసిన అభ్యర్థులు సుమారుగా 10వేలకు పైగానే ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో డీఎస్సీని ప్రతియేటా నిర్వహించే వారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పదేళ్ల కాలంలో ఒకే ఒకసారి 2017లో టీఆర్టీని నిర్వహించి 1,582 పోస్టులకు గాను 1229 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో అర్హులైన అభ్యర్థులు లేరన్న కారణంగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను నిలిపి వేశారు. అప్పటి నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనే లేదు. ఇటీవల ఎన్నికలకు ముందు ఆదరబాదరగా నోటిఫికేషన్‌ను విడుదల చేసినా.. ప్రయోజనమే లేకుండా పోయింది.

తీవ్రమైన పోటీ

దాదాపుగా ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న మెగా డీఎస్సీకి జిల్లాలో తీవ్రమైన పోటీ కనిపిస్తోంది. 2024 డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 324 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో హిదీ పండిత్ 1, మరాఠీ 2, తెలుగు పండిత్ 9, ఉర్దూ పండిత్ 2, మొత్తం 14 పోస్టులు ఉన్నాయి. అలాగే పీఈటీ హిందీ 1, పీఈటీ తెలుగు 1, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు.. మొత్తం 80 ఉండగా ఇందులో 6 స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. ఎస్జీటీలకు సంబంధించి 228 పోస్టులు ఉండగా.. ఇందులో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ పోస్టులు 19 ఖాళీలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవానికి జిల్లాకు 2,752 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా.. 2,299 మంది ఉపాధ్యాయులు ప్రస్తుతం పని చేస్తున్నారు. మరో 453 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కానీ ప్రభుత్వం వివిధ కారణాలతో 324 పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ప్రతీసారి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఖాళీలతోనే నెట్టుకొచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విద్యావలంటీర్ల నియమకాన్ని కూడా సకాలంలో చేపట్టక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అసలే సర్కారు చదువులపై ప్రజల్లో ఎన్నో అపోహలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వమైన సర్కారు చదువులపై భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్పెషల్ డీఎస్సీ లేనట్లే..

గత కొన్నేళ్లుగా ఏజెన్సీలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు స్పెషల్ డీఎస్సీని నిర్వహించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. కానీ, ఈసారి కూడా స్పెషల్ డీఎస్సీపై ప్రభుత్వం ఊసెత్త లేదు. దీంతో ఆదివాసీ నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆదివాసీ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. 2012లో చివరి సారిగా స్పెషల్ డీఎస్సీని నిర్వహించిన ప్రభుత్వం ఇప్పటి వరకు స్పెషల్ డీఎస్సీ జోలికి వెళ్లలేదు. 2013లో ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న 569 పోస్టులను భర్తీ చేయాలని అప్పటి ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసిన నియమకాలను చేపట్టలేదు. 2021లో జీవో నెంబర్ 3ని ఎత్తి వేయడంతో ఏజెన్సీ డీఎస్సీకి అడుగడుగున అడ్డంకులే ఏర్పడుతున్నాయి. కేవలం ఏజెన్సీలో ఉపాధ్యాయుల నియామకం, పదోన్నతుల కోసమే జీవో నెం. 3ని గత ప్రభుత్వం అమలు చేసింది. ప్రస్తుతం జీవో నెం.3 అమలును నిలిపి వేయడంతో ఏజెన్సీ డీఎస్సీ ప్రశ్నార్థకంగా మారింది. దీనిని మళ్లీ పునరుద్ధరించాలని ఆదివాసీ సంఘాలు ఎన్నో పోరాటాలు చేస్తున్న ఫలితం కనిపించడం లేదు. ఇటీవల జిల్లాలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లోను జీవో నెం.3ని పునరుద్ధరించాలన్న డిమాండ్లు వినిపించాయి. దీనిని పరిశీలిస్తామన్న జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క హామీ ఇచ్చినా.. ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదంటున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్జీటీ పోస్టులు పెంచడం సంతోషకరం

: సబ్బి నవీన్‌కుమార్, డీఎడ్ అభ్యర్థి, ఆదిలాబాద్



గత ప్రభుత్వం వేసిన డీఎస్సీ నోటిఫికేషల్లో తక్కువ మొత్తంలో ఎస్జీటీ పోస్టులు ఉండడంతో కొంత నిరుత్సాహ పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం మరలా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి.. జిల్లాలో ఎస్జీటీ పోస్టులను పెంచి ఇవ్వడం చాలా సంతోషకరంగా ఉంది. ఎక్కువ పోస్టులు ఉండడంతో ఎలాగైనా జాబ్ సాధించాలని కసితో చదువుతాం. ఈసారి ఎలాగైనా గట్టిగా చదివి ఉద్యోగాన్ని సంపాదించి తీరుతా.

సంక్షిప్త సమాచారం

ప్రశాంతంగా జేపీఎస్ ఎన్నికలు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: తెలంగాణ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా ఎన్నికలు నిర్వహించారు. గురువారం బీసీ సంక్షేమ సంఘ భవనంలో జిల్లా నూతన కార్యవర్గం కోసం ఎన్నికలను ప్రశాంతంగా చేపట్టారు. జిల్లలోని వివిధ ప్రాంతాల జేపీఎస్‌లు తమ ఓటు హక్కును వినియగించుకున్నారు. రెండేళ్ల అధ్యక్ష పదవికి 2, ప్రధాన కార్యదర్శికి 2, కోశాధికారికి 2కి పోటీ పడ్డారు. జిల్లాలో 344 మంది ఓట్లకు గాను 300 ఓట్లు పోల్ అయ్యాయి. ఎన్నికల అధికారులుగా అమన్ ఫౌండేషన్ సభ్యులు వ్యవహరించారు. ఎన్నికైన కార్యవర్గం రెండేళ్ల పాటు కాలపరిమితి ఉంటుందని అమన్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఎన్నికలతో బీసీ భవన్ ఎదుట సందడి వాతావరణం నెలకొంది.

సరైన అవగాహన లేక సంక్షేమ పథకాలకు దూరం : రాజు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: కార్మికులకు వారి హక్కులు, చట్టాల గురించి కార్మిక శాఖ తరఫున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు అన్నారు. జాతీయ సంఘం పిలుపు మేరకు కార్మిక కార్యాలయ ముట్టడిలో భాగంగా గురువారం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజలింగుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు మాట్లాడుతు భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు సరైన అవగాహన లేక సంక్షేమ పథకాలను పొందలేక పోతున్నారని అన్నారు. మండలాల వారీగా కార్మిక శాఖ తరఫున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు గంగయ్య, సహాయ కార్యదర్శి ఆకుల రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు టాక్రెమహేందర్, సహాయ కార్యదర్శి నాగోరావ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత : సీఐ

గుడిహత్నూర్, ఫిబ్రవరి 29: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మండలంలో పట్టుకున్నట్లు ఇచ్చోడ సీఐ భీమేష్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు మహారాష్ట్రలోని వసీంకు చెందిన మోహిని సంతోష్ రాకే అనే మహిళ స్కూటీపై ఒరిస్సా రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వసీం గంజాయి తరలిస్తుందనే విశ్వసనీయ సమాచారం అందగా గుడిహత్నూర్ మండలంలోని మాన్కపూర్ వద్ద గురువారం ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఆమే స్కూటీని ఆపి తనిఖీ చేయగా ఆమె వద్ద 28 కిలోల గంజాయి లభించిందన్నారు. పట్టుబడిన గంజాయి విలువ ఏడు లక్షల వరకు ఉంటుందన్నారు. గంజాయితో పాటు స్కూటీ, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని మహిళను అదుపులో తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేష్

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్
- తొలిసారి మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి హాజరు
- పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్



పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: రాజకీయాలకు అతీతంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీని తెలంగాణలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, ప్రతీఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశ మందిరంలో చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలిసారిగా ఎమ్మెల్యే సమావేశానికి హాజరుకావడంతో శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం ఏజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా తనవంతుగా కృషి చేస్తానన్నారు. గతంలో మంజూరైన ఇంకా నిర్మాణ దశలనే ఉన్నాయన్నారు. దీని గల కారణాలను తెలుసుకుంటు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. కార్మికులకు నెల నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలన్నారు. ప్రజలతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించడం ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు కర్తవ్యంగా భావించాలన్నారు. ఎన్నికల వరకే పార్టీలు ఉంటాయని, గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరు ప్రజల కోసమే పని చేయాల్సి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్‌రంజాని, కమిషనర్ మహ్మద్‌ఖమర్ అహ్మద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా తీస్తున్న ప్రిసైడింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు



ఎంపీపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

లక్కీడ్రా ద్వారా గుడిహత్నూర్ ఎంపీపీ ఎంపిక

- కేంద్రే జ్ఞానోబాకు ధ్రువపత్రం అందజేసిన ప్రిసైడింగ్ ఆఫీసర్

గుడిహత్నూర్, ఫిబ్రవరి 29: గుడిహత్నూర్ ఎంపీపీగా మండలంలోని మన్నూర్ ఎంపీటీసీ కేంద్రే జ్ఞానోబా లక్కీడ్రా ద్వారా ఎంపికయ్యారు. బుధవారం ఎన్నిక నిర్వహించగా సరైన మెజారిటీ రాకపోవడంతో వాయిదా పడింది. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ఎంపీటీసీలు హాజరయ్యారు. మన్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ కేంద్రే జ్ఞానోబా ఎంపీపీకి పోటీలో నిలబడగా.. తోషం ఎంపీటీసీ సాగిర్‌ఖాన్ ప్రతిపాదించగా మచ్చాపూర్ ఎంపీటీసీ జాదవ్ వచ్చల బలపరిచారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గురుజ ఎంపీటీసీ పెందూర్ లలిత ఎంపీపీకి పోటీలో నిలబడగా గుడిహత్నూర్ ఎంపీటీసీ అంకతి సవిత, ప్రతిపాదించగా, సీతాగొంది ఎంపీటీసీ చిట్యాల కృష్ణవేణి బలపరిచారు. బీజేపీకి చెందిన శాంతాపూర్ ఎంపీటీసీ భారత్, గుడిహత్నూర్-2 ఎంపీటీసీ కోవ తులసి పోటీకి దూరంగా ఉండి తటస్థులుగా ఉన్నారు. పోటీకి నిలబడ్డ ఇద్దరు అభ్యర్థులకు సరైన మెజారిటీ రాకపోవడంతో లక్కీ డ్రా పద్ధతి ద్వారా ఎన్నుకున్నారు. ఇద్దరి పేర్లు రాసి చిట్టీలు డబ్బాలో వేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు చీటి తీయగా కేంద్రే జ్ఞానోబా పేరు వచ్చింది. దీంతో ఆయనను ఎంపీపీగా ప్రకటించి సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం ఎంపీపీ ఛాంబర్‌లో ఎంపీపీ కేంద్రే జ్ఞానోబాను శాలువాతో సన్మానించి అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్ హై, తదితరులు పాల్గొన్నారు.

- ప్రజల గుండెల్లో బలంగా ఉన్నాం : ఎమ్మెల్యే అనిల్

గుడిహత్నూర్: తమ పార్టీ అధికారం కోల్పోయినా ప్రజల గుండెల్లో బలంగా ఉన్నామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా ఎంపికైన ఎంపీపీ కేంద్రే జ్ఞానోభాను శాలువతో సన్మానించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది ఆరంభం మాత్రమే అన్నారు. బీజేపీ కంచుకోటగా పిలువబడే గుడిహత్నూర్ మండలంలో బీఆర్ఎస్ కంచుకోట త్వరలోనే మారుస్తామన్నారు. ఎంపీపీ విజయం మండల బీఆర్ఎస్ కార్యకర్తలకే అంకితమన్నారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించి కేసీఆర్‌కు అంకితం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తోషం ఎంపీటీసీ సాగిర్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, మాజీ సర్పంచ్ తిరుమల్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో ఒకరి మృతి

తలమడుగు, ఫిబ్రవరి 29: మండలంలోనిసుంకిడి గ్రామానికి చెందిన రేవారిలక్ష్మన్న (31) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన రేవరి లక్ష్మన్న బుధవారం ఉదయం 11గంటల ప్రాంతంలో చేపలు పట్టడానికి ఉండం గ్రామ శివారులోని నల్లగుండ్ల మడుగు వద్దకు వెళ్లగా అక్కడున్న విద్యుత్ మోటార్‌ద్వారా నీటిలోకి విద్యుత్ సరఫరా కావడంతో చేపలు పడుతున్న లక్ష్మన్నకు నీటి ద్వారా కరెంట్‌షాక్ తగలడంతో నీటిలో పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. భార్య రేవని గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



హెలీప్యాడ్ ల్యాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సమన్వయంతో ముందుకు వెళ్లాలి : ఎంపీ

- ప్రధాని మోదీ సభ ఏర్పాట్లపై సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: మార్చి 4న ఆదిలాబాద్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రానున్నారని ఎంపీ సోయం బాపురావు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఎం సభ విజయవంతం పై ఆదిలాబాద్ పార్లమెంటరీ సమావేశం నిర్వహించారు. గ్రామ స్థాయి నుంచి జనాలను సమీకరించి సభను జయప్రదం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం పలువురికి సభ బాధ్యతలను అప్పగించారు. దాదాపు 60వేల నుంచి లక్ష మంది హాజరయ్యే విధంగా ప్రణాళికలు చేస్తూ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరోసారి బీజేపీ అధికారం చేపట్టేలా ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ఆదిలాబాద్‌కు వస్తున్నారన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. సభకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్దఎత్తున జనాలు వచ్చేలా కార్యకర్తలు సమన్వయంతో సాగాలన్నారు. జనసమీకరణయ్యే లక్ష్యంగా గ్రామాల్లో కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఇదిలా ఉంటే అటు ప్రధాని పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ల్యాండ్ ప్రాంతమైన ఎరోడ్రమ్‌ను ఎంపీ, ఎమ్మెల్యే పాయల శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి పరిశీలించారు. ల్యాండింగ్ తర్వాత అక్కడి నుంచి సభ స్థలానికి వచ్చే మార్గాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్థన్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, పార్లమెంట్ ప్రభారి అల్లపూరే శ్రీనివాస్, కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్యమాజీ ఎంపీ రమేష్‌రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, ఆదినాథ్, అభినవ్‌సర్ధార్, జ్యోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి అమ్ముకున్నాక.. ధర పెరిగింది

బోథ్, ఫిబ్రవరి 29: పత్తి పంట విక్రయాలు పూర్తయిన తరువాత మార్కెట్‌లో పత్తి ధర పెరుగుతుండడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. బహిరంగ మార్కెట్లో రైతుకు మద్దతుగా సీసీఐ మద్దతు ధరతో పత్తి పంట కొనుగోలు చేపట్టింది. అయితే రైతులు మాత్రం పెద్ద మొత్తంలో సీసీఐకి ఏడు వేల పైచిలుకు ధరల్లో విక్రయించారు. అయితే రైతులు మాత్రం పెద్ద మొత్తంలో సీసీఐకి ఏడు వేల పైచిలుకు ధరల్లో విక్రయించారు. అయితే పత్తి నాణ్యత తగ్గిందని సీసీఐ అధికారులు నెల రోజుల నుండి 6900 కొనుగోలు చేస్తున్నారు ప్రైవేటు వ్యాపారులు మాత్రం సీసీఐకి పోటీగా 7200 క్వింటాల్‌కు చెల్లించి కొనుగోలు చేసున్నాడు. రైతులు తీవ్ర మనోవేదన గురువుతున్నారు. తమ వద్ద పత్తి నిల్వలు ఉన్నప్పుడు ప్రైవేట్ వ్యాపారులు సీసీఐకి పోటీగా నిల్వ లేకపోయారు. పత్తి పంట ఎకరాలు జరిగిన సమయంలో ప్రస్తుతం సీసీఐ కంటే రూ.300లు ఎక్కువ చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. పత్తి ధర తగ్గుతుందని ఆందోళనతో రైతులు పంటను విక్రయించుకున్నారు. పంట అంతా విక్రయాలు జరిగిన తర్వాత పత్తి ధర పెరుగుదల తమకేం లాభమని రైతులంటున్నారు. స్టాక్ వ్యాపారులకు ధర కలిసి వచ్చిందని పేర్కొంటున్నారు. ఏది ఏమైనా పత్తి ధర పంట విక్రయాలు జరిగిన అనంతరం ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది.

గాటు పెట్టారు.. వేటు వేస్తారు



● మూడు దశాబ్దాల చెట్టు పైన కన్నేసిన స్మగ్లర్లు ● ప్రధాన రోడ్డుపై సంఘటన ● నిద్రమత్తులో అధికారులు

ఉట్నూర్, ఫిబ్రవరి 29: తెలంగాణ ప్రభుత్వ అడవుల సంరక్షణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతు ప్రతినిత్యం కంటికి రెప్పలా అడవులను కాపాడాలని అటవీశాఖ సిబ్బందిని సమకూర్చిన ఫలితం లేకుండా పోతుంది. ఉట్నూర్ మండలంలోని ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పెరుకగూడ వంతెన సమీపంలో ఉన్న మూడు దశాబ్దాల టేకు చెట్టుకు దొంగలు కన్నం పెడుతున్నారు. చెట్టును పడగొట్టడానికి గాట్లు పెట్టి వదిలేశారు. ఏదైనా రాత్రి సమయంలో పూర్తిగా చెట్టును నరికి తరలించుకోవచ్చని భావించిన స్మగ్లర్లు ఈ పనిచేసి ఉంటారని పరిశీలకులు భావిస్తున్నారు.

ప్రధానిరోడ్డుపై ఉన్న చెట్లను రక్షించలేని అటవీశాఖ అధికారులు అడవుల్లో ఉన్న చెట్లను ఎలా సంరక్షిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధి కారులు ఈ విషయంలో చొరవ తీసుకుని సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అడవులు అంతరించి పోకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు బాబ్లీ నుంచి నీటి విడుదల

● 0.6టీఎంసీల నీటిని విడుదల చేయనున్న అధికారులు



నిర్మల్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి 0.6టీఎంసీల నీటిని శుక్రవారం తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు దిగువకు విడుదల చేయనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. ప్రతీయేటా జూలై 1న బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను ఎత్తి అక్టోబరు 28వ తేదీ వరకు తెరిచి ఉంచి.. 29వ తేదీన గేట్లను మూసి వేస్తారు. అలాగే వేసవిలో గోదావరినది పరివాహక ప్రాంతాల్లోని పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రతీయేటా మార్చి 1వ తేదీన 0.6 టీఎంసీల నీటిని దిగువకు వదులుతారు. ఈ నేపథ్యంలో శుక్రవారం శ్రీరాంసాగర్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి ప్రాజెక్టు అధికారులు బాబ్లీ ప్రాజెక్టుకు వెళ్లి.. ఆ ప్రాజెక్టు అధికారులతో కలిసి ప్రాజెక్టు గేట్లను ఎత్తనున్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ అకాడమిక్ మానిటరింగ్ అధికారి జె.జగన్

విద్యార్థులు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి : ఏసీఎం

ఉట్నూర్, ఫిబ్రవరి 29: విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, క్రమ శిక్షణ పెంపొందించుకొని సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఐటీడీఏ అకాడమిక్ మానిటరింగ్ అధికారి జె.జగన్ అన్నారు. తెలంగాణ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స పీఎంఆర్సీ భవనంలో పెట్రోల్ లీడర్స్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అతిథులుతో కలిసి స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెడెన్ పావెల చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖ అభివృద్ధికి స్కౌట్ అండ్ గైడ్ శిక్షణ ఎంతో దోహదం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కాంచన వల్లి రత్నాకకర్ మాట్లాడుతూ జిల్లాలో స్కౌట్ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు అందరు కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ కోరెడ్డి పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో అమలు చేసేలా స్కౌట్ మాస్టర్లు, గైడ్‌కెప్టెన్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్ ఆఫీసర్ కె.రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్.స్వామి, జాయింట్ సెక్రటరీ లక్ష్మి, జిల్లా కమిషనర్లు గుండి మహేశ్, ఆర్‌పీలు గోవిందరావు, శంకర్, ట్రైబల్ వెల్ఫేర్ స్కౌట్స్ ఇన్‌చార్జీ యాదవరావు, పీడీ జాదవ్ హేమంత్‌నాయక్, స్కౌట్ మాస్టర్లు కాశీరం, లాల్‌షా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పథకాన్ని కొనసాగించాల్సిందే.. : ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: ప్రజలకు మంచి చేసే వాళ్ల అవసరాలను తీర్చే ఏ పథకాన్ని అయిన ప్రభుత్వాలు కొనసాగించాల్సిందేనని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల, పట్టణంలోని పలువురు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసే వాళ్ల అవసరాలనుతీర్చే పథకాన్ని అయినా ప్రభుత్వాలు కొనసాగించాల్సిందేనన్నారు. కాగా, కల్యాణ లక్ష్మి చెక్కులను వెంటనే అందించాలని, మంజూరైన వారం రోజులకే చెక్కులను వారికి పంపిణీ చేయాలని, నాయకుల కోసం వేచి చూడకుండా లబ్ధిదారులకు చెక్కులను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో అధికారులు, వివిధ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి 29: ఐటీడీఏ అధికారులు మామిడిగూడ బాలిక ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తొడసం మహేశ్వరి మృతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్మా స్టూడెంట్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ పి.హరిప్రసాద్ మాట్లాడుతూ పీజీహెచ్‌ఎం, ఏటీడీవోల నిర్లక్ష్యంతో మామిడిగూడ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తొడసం మహేశ్వరి అనే విద్యార్థిని చనిపోవడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించడంతో అక్కడ ఉన్న వైద్యులు అప్పటికే చనిపోయిందని తెలియజేయడం జరిగిందన్నారు. ఎన్నిసార్లు విద్యార్థి సంఘాలుగా కుటుంబ సభ్యులుగా హెడ్మాస్టర్‌కు, ఏటీడీవోలకు ఆశ్రమ పాఠశాలలో ఉన్న సమస్యలను చెప్పిన పట్టించుకోక పోవడంతోనే బాలిక మృతి చెందిందన్నారు. తక్షణమే ఐటీడీఏ అధికారులు చొరవ తీసుకొని హెడ్మాస్టర్, ఆదిలాబాద్ ఏటీడీవోలను సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇందులో జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్, సాయిప్రసాద్, శ్యామ్, అర్జున్, తిరుపతి, జాదవ్ రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

ఉట్నూర్, ఫిబ్రవరి 29: మండలంలోని ఘన్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శంభుగూడ గ్రామంలో నిర్వహిస్తున్నఉపాధి హామీ పనులను ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు తనిఖీ చేశారు. గురువారం శంభుగూడ ప్రాంతంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలు చేస్తున్న పని వివరాలను, హాజరు వివరాలను పరిశీలించారు. అదే విధంగా గ్రామ పంచాయతీలోని జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనిని కల్పించాలని అదే విధంగా జాబ్ కార్డులేని వారికి జాబ్‌కార్డులు ఇప్పించి పనిని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ మారుగ్రామస్థులు పాల్గొన్నారు.

పంట చేనులో అమర్చిన విద్యుత్ తీగ తగిలి వ్యవసాయ కూలీ మృతి

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 29: మండలంలోని భూతాయి(కే) గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పెందుర్ లక్ష్మణ్(56) మొక్కజొన్న చేనులో అటవీ జంతువుల నుంచి పంటను కాపాడుకోవడానికి అమర్చిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందిన సంగటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశువుల మేత కోసం ఉదయం సమయంలో చందునాయక్ తండా గ్రామానికి చెందిన పడ్వాల్ సుభాష్ పంటచేన్లోకి వెళ్లాడని తెలిపారు. అయితే అప్పటికే అక్కడ విద్యుత్ తీగలు అమర్చి ఉన్నప్పటికి గమనించని పెందుర్ లక్ష్మన్ మేత కోసేందుకు పంటచేన్లోకి వెళ్లగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. భార్య తుర్పభాయి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

● **అవగాహణ లోపంతో తరచూ ప్రమాదాలు**

సంబంధిత ఫారెస్టు అధికారులు అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలను అమర్చకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ.. గ్రామస్థాయిలో సరైన అవగాహన లేకపోవడంతో రైతులు పంటలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో పంట చేను చుట్టూ విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తున్నారు. అటవీ జంతువుల వల్ల పంట నష్టపోతే తగిన పంటకు సంబంధించి నష్టపరిహారాన్ని అటవీశాఖ తరుపున చెల్లించే నిభందనల గురించి తండాలలో, పల్లెల్లో సరైన అవగాహణ లేకపోవడంతోనే తరుచుగ అక్కడక్కడ ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మండలవాసులు పేర్కొన్నారు. ఇకనైన ఫారెస్టు, విద్యుత్ అధికారులు సమన్వయంతో ప్రతి గ్రామంలో అవగాహణ సదస్సులను ఏర్పాటు చేసి భవిశ్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మావల, ఫిబ్రవరి 29: పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మావల మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఫారూక్ ఖాన్ (28) గత కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో తరచూ మద్యం తాగడానికి డబ్బులు ఇంట్లో అడుగుతూ గొడవకు దిగేవాడు. ఈనెల 25న మద్యం కోసం ఇంట్లో డబ్బులు అడిగేసరికి వారు నిరాకరించడంతో తీవ్రమనస్థాపానికి గురైన ఫారూక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు రిమ్స్‌కి తరలించి చికిత్స అందించారు. కాగామూడు రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరుపిల్లలు ఉన్నారు. తండ్రి మహ్మద్ రజాక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కవ్వాల్ టైగర్‌జోన్‌లో రగులుతున్న కార్చిచ్చు!!

సిరిచెల్మ, కవ్వాల్ టైగర్‌జోన్‌లో ప్రమాదవశాత్తు అంటుకున్న కార్చిచ్చు అడవి తల్లిని దహించి వేస్తుంది. సిరిసెల్మ బీట్ పరిధిలోని పాలవాగు, సిరిచెల్మ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అంటుకున్న మంటలు క్రమంగా విస్తరిస్తున్నాయి. వాటిని ఆర్పే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో పచ్చని వృక్షాలు మంటలకు ఆహుతి వుతున్నాయి. తక్షణ చర్యలుచేపట్టి అడవితల్లిని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)





కవ్వాల్ టైగర్‌జోన్‌లో చెలరేగుతున్న మంటలు ఇలా..

ఘనంగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

● **పెద్దసంఖ్యలో తరలివస్తున్న భక్తజనం**

తలమడుగు, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఘనంగా గరుడస్వామి వివాహాన్ని నిర్వహించిన వేద పండితులు.. ఈనెల 29 నుంచి మార్చి 2 వరకు శ్రీనివాస కల్యాణ బ్రహ్మోత్సవాలను కన్నుల పండుగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గత నాలుగున్నర దశాబ్దాల నుంచి ప్రతి సంవత్సరం ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు గ్రామస్థులు భక్తులు భారీ ఏర్పాట్లను చేపట్టారు. ఆలయంలో ఈ నెల 29 నుంచి వేద పండితులతో యజ్ఞ కార్యక్రమాలు మార్చి 2న శ్రీనివాస కల్యాణ రథోత్సవం నిర్వహించేందుకు ఆలయాన్ని విద్యుత్ కాంతులతో రంగురంగుల పూలతో అలంకరించి ఏర్పాట్లు చేపడుతున్నారు. అంతేకాకుండా బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ గ్రామస్థులు సహకంతో కబడ్డీ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులే కాకుండా మహారాష్ట్ర వేలాది మంది భక్తులు తరలివస్తారు. అంతేకాకుండా గ్రామస్థులు ఏ చిన్న కార్యక్రమం చేపట్టిన వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు తీసుకొని పనులను ప్రారంభిస్తారు. నమ్ముకున్న వారికి నమ్ముకున్నంతగా కోరికలు తీరడంతో భక్తులు తమ మొక్కులను తీర్చుకుంటున్నారు. అదే విధంగా మార్చి 2న నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ప్రజా ప్రతినిధులు అధికారులు వస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తులకు గ్రామస్థులకు కాలక్షేపం కోసం గురువుల ప్రవచనాలు హారికథలు నాటికలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఆలయంలో మహాయజ్ఞం నిర్వహిస్తున్న వేద పండితులు





ఆలయంలోని వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే

● **వైభవంగా మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన**

మావల, ఫిబ్రవరి 29: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గత మూడు రోజులుగా మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయ ప్రాంగణంలో హోమాలు, తదితర పూజలు కొనసాగాయి. గురువారం మార్కండేయ విగ్రహాన్ని వేద పండితులు శ్రీకాంత్ శర్మ, అరుణ్ శర్మ, బృందం వేద మంత్రోచ్ఛరణ నడుమ శత్రియంగా మార్కేండేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు దైవ దర్శనానికి అనుమతించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గోపాల కృష్ణ మఠాధిపతి యోగనంద సరస్వతీ, ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు.. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉరుకులు, పరుగులు గమన జీవనంలో ప్రజలు కొంచెం ఆధ్యాత్మిక కార్యక్రమానికి సమయం కేటాయించాలని, ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని వారు పేర్కొన్నారు.. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పద్మశాలి కులస్తుల కుల గురువైన మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన కులస్తులకు, గ్రామస్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అందరికీ మార్కండేయ ఆశీస్సులు ఉండాలని భగవంతున్ని వేడుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాలుకా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్, ఆలయ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోర హన్మాండ్లు, వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడు కామని విఠల్, చైర్మన్ జిట్ట రమేష్, కోశాధికారి మోర దత్తు, ఉపాధ్యక్షుడు జిట్ట నర్సింగ్, సభ్యులు బొమ్మ కంటి నర్సింగ్, అశోక్, సత్యనారాయణ, గంగారెడ్డి, కుర్ర నందు, తదితరులు పాల్గొన్నారు.



హోమం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

వేతనం పెంచరు.. క్రమబద్ధీకరించరు

● దయనీయంగా సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల పరిస్థితి

● జిల్లాలో 54మంది సీఆర్పీలు



బడి వయట పిల్లలను గుర్తిస్తున్న సీఆర్‌పీ

● **ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

- దుర్గం సందీప్, సీఆర్‌పీల సంఘం జిల్లా కోశాధికారి



విద్యాశాఖలో పనిచేస్తున్న మాకు ఉద్యోగ భద్రత కల్పించి తగిన వేతనం చెల్లించాలి. ఉపాధ్యాయుడికి ఉండాల్సిన అర్హతతో కాంట్రాక్టు పద్ధతిలో సీఆర్ పీలను తీసుకున్నారు. 13 సంవత్సరాలుగా చాలీచాలనీ వేతనాలతో పని చేస్తున్నాము. ప్రభుత్వం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే సౌకర్యాలను కల్పించాలి.

వాంకిడి, ఫిబ్రవరి 29: విద్యాశాఖలో పదమూడే ళ్లుగా పనిచేస్తున్న సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగు లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతు న్నారు. ఉద్యోగభద్రత కల్పించి సమానపనికి సమా నవేతనం ఇవ్వాలని గతంలో అధికారులు, ప్రభుత్వా నికి వినతిపత్రాలు అందించారు. అయినా స్పందన లేకపోవడంతో 2023 ఆగస్టు 17నుంచి 45రోజుల పాటు సామూహిక రిలే నిరాహార దీక్షలు చేశారు. దీక్షలు విరమించి విధుల్లో చేరితేనే చర్చలు జరుపు తామని గత ప్రభుత్వం ప్రకటించడంతో విధుల్లో చేరారు. తరువాత ఎన్నికలు రావడం, కొత్త ప్రభు త్వం ఏర్పడటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. జిల్లాలో 54మంది సీఆర్‌పీలు పనిచేస్తున్నారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లను స్కూల్ అసిస్టెంట్‌లకు సమానమైన విద్యార్హతతో నియమిం చారు. డిగ్రీ, బీఈడీ, టెట్, పీజీ పూర్తిచేసిన వారు సీఆర్‌పీలుగా పనిచేస్తున్నారు. వీరికి నెలకు వేతనం రూ.19,350 మాత్రమే చెల్లిస్తున్నారు. అదేవిధంగా కేజీబీవీ, యూఆర్ ఎస్‌ల్లో టీచింగ్, నాన్‌టీచింగ్, కంప్యూటరు ఆపరేటర్లు, ఎంఐఎస్ సమన్వయ కర్తలు, ఐఈఆర్‌పీలు, పీటీఐ, ఎమ్మార్సీ మెసేంజర్స్ తదితరులు కూడా పనిచేస్తున్నారు.

వీరంతా వేతనాలు పెంచ డంతో పాటు క్రమబద్ధీకరించాలని ఎంతో కాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. విద్యారంగంలో నిర్వహించే పనులతోపాటు ప్రభుత్వం నిర్వహించే ఇతర కార్యక్రమాలకు కూడా వీరిని వినియోగించుకుంటున్నారు. మహిళా ఉద్యోగులకు ఆరునెలలకు ప్రసూతి సెలవులు మంజూరు చేసి క్లస్టర్ల సంఖ్యను పెంచడంతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

దేహదారుఢ్యానికి క్రీడలు దోహదం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 29: పోలీసుల దేహదారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ సాయుధబలగాలకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించగా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల మానసికోల్లాసం కోసం వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. సిబ్బందిలో నూతనఉత్సాహం పెంచేందుకు ఈటోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. విధుల్లో ఒత్తిడినుంచి బయట పడడానికి శారీరకదృఢత్వాన్ని క్రీడలు తోడ్పడతాయన్నారు. క్రీడలు మనలో దాగిఉన్న శక్తిసామర్థ్యాలను, పోరాట పటిమను వెలికి తీస్తాయన్నారు. పోలీసులు వ్యాయమాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు.



పోలీసు క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠ

నేరడిగొండ, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ, నవగ్రహా, ధ్వజా, శిఖర, మందిర ప్రతిష్ఠాపన మహోత్సవం కార్యక్రమంగురువారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఎంపీపీ రాథోడ్‌సజన్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆడేవసంత్‌రావ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డిలతో పాటు వివిధ గ్రామాల ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ ఏలేటి సుధాకర్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా శ్రీరాజరాజేశ్వర గుడిని లక్షలు వెచ్చించి నిర్మించడం ఒక గొప్ప కార్యమని ఇంతటి గుడిని నిర్మించి వేద మంత్రాల పండితుల నడుమ శివాలయ ప్రారంభోత్సవం కన్నుల పండుగా నడిపించిన నేరడిగొండ మండల ప్రజలకు, ఏలేటి సుధాకర్‌రెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా భక్తులు ప్రతి ఒక్కరు తమ మదిలో ఆధ్యాత్మికను అలవర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మూడు రోజుల పాటు అన్నదానం ఇచ్చిన ఏలేటి వారి కుటుంబ సభ్యులకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కళాకారులు పాడిన పాటలకు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ భక్తులతో కలిసి నృత్యం చేశారు. మూడు రోజుల పాటు శ్రీ శివనంద స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పీవీ రమణ, రాజశేఖర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, లోక నిరీష్‌రెడ్డి, కొక్కుల గంగాధర్, చాతల్లా భోజన్న, శ్రీనివాస్, తదితరులున్నారు.



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న నారాయణ మహరాజ్

ప్రతీఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి

ఇంద్రవేల్లి ఫిబ్రవరి 29: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలందరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని ఆధ్యాత్మిక గురువు నారాయణ మహరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు వినిపించారు. ముఖ్యంగా మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలందరూ సన్మార్గంలో నడుచుకోవాలని భక్తులకు వివరించారు. ఇంట్లో ఉన్న దేవుడు ఇంటిల్లిపాదికి కుటుంబక్షేమం చూస్తే, ఆలయంలో ఉన్న దేవుడు లోకాన్ని సంరక్షిస్తాడన్నారు. గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రతి శనివారం సామూహికంగా హనుమాన్ చాలీసా పఠనం చేయాలన్నారు. హిందువుల ఉత్సవాల కోసం ప్రజలపై భారం పడకుండా ఉండేందుకు విరాళాలు సేకరించి పద్ధతిలో మార్పులు చేయాలని ఉద్దేశంతో గత ఏడు నెలలు క్రింద విరాళం సేకరణ బాక్స్‌లు 370 ఇంట్లోకి అందించి 2 లక్షల 60 వేల రూపాయలు విరాళం సేకరించారు. ఈ విరాళాలతో మహిళల ఆర్థిక అభివృద్ధి ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ప్రజలలో దైవ భక్తిని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గిత్తే మారుతి మహరాజ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, పడ్ విశ్వనాథ్, పడ్ దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

'రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి'

గుడిహత్నూర్, ఫిబ్రవరి 29: మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కదం నారాయణ రైతు ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని అన్నీ విధాలుగా ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. గురువారం ఆయన రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవంగా గత రెండు, మూడు సంవత్సరాల నుంచి అతివృష్టి, అనావృష్టి ఉండడంతో ఆశించినంత పంట దిగుబడి రాక పోవడంతో మానసికంగా కుంగిపోయి పంటకు పెట్టిన పెట్టుబడులు రాలేవని, తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబానికి రైతుభీమాతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 194 జీవో ప్రకారం ఆరు లక్షల రూపాయల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఽ ఆయన వెంట రైతులు బలిరామ్, గోవింద్, బాలజీ, తదితరులు ఉన్నారు.

పల్స్ పోలియోపై అవగహన

ఇంద్రవేల్లి , ఫిబ్రవరి 29: మండలంలోని అన్ని గ్రామాల్లో మార్చి 3న చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ, ఏఎస్‌ఎంలకు, ఆశ వర్కర్లకు పల్స్ పోలియోపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఐదు సంవత్సరాల లోపు 3841 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. వచ్చే నెల 3, 4, 5వ తేదీలలో మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సందీప్, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పల్స్ పోలియోపై అవగహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి


andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.9 కనిష్ఠం 22.5
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 1 మార్చి 2024



నర్సాపూర్ (జి) వైస్ యంపీపీ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 29 : మండల వైస్ యంపీపీ మ్యాదరి లక్ష్మీ సుధాకర్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డికి పార్టీని వీడుతున్నట్లు రాజీనామా పత్రాన్ని గురువారం అందజేశారు. ముధోల్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యేగా రామారావ్ పటేల్ గెలుపొంది ఇతర పార్టీలోని ప్రజాప్రతినిధులకు నో ఎంట్రీ అనే సూచనలు ఇస్తుండడంతో నర్సాపూర్ (జి) నూతన మండల వైస్ యంపీపీ మ్యాదరి లక్ష్మీసుధాకర్ కాంగ్రెస్ పార్టీ వైపే వెళ్లెందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.





స్వచ్ఛ పురపాలన

- ముస్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ శానిటేషన్
- నిర్మల్, ఆదిలాబాద్ మున్సిపాలిటీల ఎంపిక
- రాష్ట్రంలో మొత్తం 20 మున్సిపాలిటీలకు అవకాశం
- ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో 20 రోజులపాటు సర్వే
- భారీగా కేంద్ర నిధుల కేటాయింపుకు అవకాశం

నిర్మల్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఎంపిక చేసిన 20 మున్సిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ శానిటేషన్ ప్రోగ్రామ్‌ను అమలు చేయబోతున్నారు. ఈ 20 మున్సిపాలిటీలలో పకడ్బందీగా శానిటేషన్ ప్రోగ్రామ్ అమలు కోసం సంబంధిత అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 20 మున్సిపాలిటీలలో అస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా)కు సంబంధించిన అధికారులు 20 రోజులపాటు క్షేత్రస్థాయి సర్వే చేపట్టబోతున్నారు. మున్సిపాలిటీల్లోని అన్ని వార్డులలో ఈ బృందాలు పర్యటించి అక్కడి పారిశుధ్య పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ, మురికి కాలువల పరిస్థితులను అధ్యయనం చేయనున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగానే ఈ మున్సిపాలిటీల ఎంపిక జరిగింది. ఇప్పటివరకు 20 మున్సిపాలిటీలలో అమలవుతున్న ప్రగతి కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని అందులోని లోటు పాట్లు, భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రగతి కోసం అవసరమయ్యే సిఫారసులతో కూడిన నివేదికలను ఈ బృందాలు రూపొందించనున్నాయి. ఈ నివేదికల ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కింద ఎంపిక అవకాశంతో పాటు మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో శానిటేషన్ కోసం నిధులు మంజూరు కానున్నాయి. గత కొంతకాలం నుంచి మున్సిపాలిటీలకు పారిశుధ్య సమస్య సవాలుగా మారుతోందంటున్నారు. ప్రభుత్వం నిధులు సక్రమంగా మంజూరు చేయకపోతుండడం.. అలాగే పారిశుధ్య సిబ్బంది కొరత, వాహనాల కొరత వంటి అంశాలు సమస్యను తీవ్రం చేసేందుకు దోహదపడుతున్నాయంటున్నారు. ముఖ్యంగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీ పట్టణాలు రోజు రోజుకూ పెరిగిపోతుండడం, శివారు ప్రాంతాలు విలీనమవుతుండడంతో పాటు జనాభా సైతం పెరిగిపోతున్న కారణంగా పారిశుధ్య సమస్య మున్సిపాలిటీలకు ఛాలెంజ్‌గా మారుతోంది. ముఖ్యంగా సానిటేషన్ సమస్య పరిష్కారం కోసం అవసరమైన కార్యాచరణతో పాటు పర్యవేక్షణ తప్పనిసరి అంటున్నారు. పారిశుధ్య సమస్యను పరిష్కరించేందుకు పర్యవేక్షణ అధికారులు అందుబాటులో లేకపోతుండడం అలాగే ఉన్న అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్య జటిలమవుతోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ద్వారా స్వచ్ఛ సర్వేక్షన్ అమలవుతుండడం సమస్య పరిష్కారం కోసం ఆశలను రెట్టింపు చేస్తోంది.

● స్వచ్ఛ సర్వేక్షన్ కోసం రెండు మున్సిపాలిటీల ఎంపిక


స్వచ్ఛసర్వేక్షణ్ 2023 కింద ఎంపిక అయ్యేందుకు గాను నిర్మల్, ఆదిలాబాద్ మున్సిపాలిటీలకు అవకాశం కల్పించారు. ఈ రెండు మున్సిపాలిటీలతో పాటు రాష్ట్రంలోని మొత్తం 20 మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. బహిరంగ మల విసర్జన లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దే కార్యక్రమం కింద మున్సిపాలిటీలకు అవకాశం కల్పించారు. నిర్మల్, ఆదిలాబాద్‌తో పాటు మరో 18 మున్సిపాలిటీలలో ఇక నుంచి ఇంటిగ్రేటెడ్ శానిటేషన్ ప్రోగ్రామ్ అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు పనులు మొదలు పెట్టారు. కాగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాతో క్షేత్రస్థాయి పరిస్థితులను అనుసంధానం చేస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

● గల్లీల్లో డంపింగ్ యార్డులు

కాగా నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలో శానిటేషన్ గతి తప్పిందన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా సిబ్బంది కొరతతో పాటు పర్యవేక్షణకు సంబంధించిన అధికారుల పోస్టులు ఖాళీగా ఉండడం పారిశుధ్య సమస్యకు కారణమవుతోంది. జిల్లా కేంద్రమైన నిర్మల్‌లోని అనేక గల్లీలు చెత్త కుప్పలతో పేరుకుపోతున్నాయి. ఖాళీ స్థలాల్లో జనం ఇష్టానుసారంగా చెత్తను వేస్తుండడంతో ఆ ప్రదేశాలన్నీ మినీ డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రియదర్శినినగర్, శాస్త్రీనగర్, ఇంద్రానగర్‌లతో పాటు తదితర ప్రాంతాల్లో అడుగడుగునా మినీ డంపింగ్ యార్డులు దర్శనమిస్తుంటాయి. అయితే చెత్తసేకరణ సక్రమంగా జరగకపోతుండడం ఈ సమస్యకు కారణమంటున్నారు. ఎప్పటికప్పుడు ఇళ్ల నుంచి మున్సిపల్ సిబ్బంది చెత్తను సక్రమంగా సేకరించినట్లయితే ఈ సమస్య ఉత్పన్నం కాబోదు. చెత్త సేకరణకు సంబంధించిన వాహనాల కొరత కూడా సమస్యను రెట్టింపు చేస్తోంది.

● కాల్చి పడేస్తున్నారు..

ఇదిలా ఉండగా పట్టణాల్లోని అనేక గల్లీల్లో పేరుకుపోతున్న చెత్తను మున్సిపల్ సిబ్బంది తరలించడం లేదు. వారంతా ఆ చెత్తనంతా కాల్చివేస్తూ కాలుష్య ముంపనుకు తెరలేపుతున్నారు. పేరుకుపోయిన చెత్తను కాల్చివేసి చేతులు దులుపుకుంటుండడం ప్రజలకు ప్రాణసంటకంగా మారుతోందది. కాలుతున్న చెత్త కారణంగా దుర్గంధం, విష పూరితమైన పొగ విస్తరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తను కాల్చివేస్తుండడంతో వెలువడే పొగ ప్రజలకు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. ట్రాక్టర్లు, టిప్పర్‌లలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పారిశుధ్య సిబ్బంది, వాహనాల కొరత కారణంగానే సమస్య తీవ్రమవుతోందంటూ అధికారులు పేర్కొంటున్నారు.



ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు

279 మంది విద్యార్థుల గైర్హాజరు

భైంసా, ఫిబ్రవరి 29 : ఇంటర్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన మొదటి పరీక్షలో జిల్లా వ్యాప్తంగా 279 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 23 పరీక్షా కేంద్రాలలో మొత్తం 6506 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఇందులో 6227 మంది విద్యార్థులు హాజరవ్వగా 279 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కోర్సుకు సంబంధించి 5531 మంది విద్యార్థులకు 183 మంది, వోకేషనల్ కోర్సుకు సంబంధించి 975 మంది విద్యార్థులకు 96 మంది గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

లోపాలకు తావులేకుండా ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరీక్ష నిర్వాహణాధికారులకు సూచించారు. గురువారం భైంసా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. తాగునీటి వ్యవస్థ, వైద్య సిబ్బంది వివరాలను డీవో కార్గాం వినోద్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరీక్ష కేంద్రం నిర్వాహకులకు నిర్వాహణ వ్యవస్థపై పలు సూచనలు, సలహాలు అందించారు. పరీక్ష రాసే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూసుకోవాలన్నారు. సమస్యలు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

దిలావర్‌పూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం రోజు జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలో 209 మంది విద్యార్థులకు గాను తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కే. శంకర్, డీవో లక్ష్మీకాంత్ తెలిపారు. కాగా పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది.

పెద్దకర్మకు వెళ్లి తిరిగి వస్తుండగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


భోజన్న మృత దేహం

భైంసా/నర్సాపూర్ (జి), ఫిబ్రవరి 29 : భైంసా -నిర్మల్ జాతీయ రహదారి మార్గంలోని నర్సాపూర్ (జి) మండల పరిధిలో గల తురాటి గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యుపడ్డారు. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన భోజన్న (41) ఇదే మండలంలోని అర్లి గ్రామంలో జరిపిన సమీప బంధువు పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై వస్తుండగా ప్రమాదం బారిన పడ్డారు. అర్లి నుంచి నర్సాపూర్(జి)కు ద్విచక్రవాహనం పై వస్తుండగా తురాటి- నందన్ గ్రామాల మధ్య గల వంతెన వద్ద గుర్తు తెలియన వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఘటనస్థలిలోనే మృత్యువాతపడ్డాడు. రాత్రి వేళలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

టిప్పర్.. బైక్ ఢీ

● బాలుడి దుర్మరణం ● మరో యువకుడి పరిస్థితి విషమం


మృతి చెందిన బాలుడు ప్రీతమ్


తీవ్రగాయాలతో విఠల్

భైంసా, ఫిబ్రవరి 29 : భైంసా- నిర్మల్ జాతీయ రహదారి మార్గంలోని మాటేగాం గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడొకరు దుర్మరణం పాలయ్యాడు. భైంసా పట్టణంలోని గోపాల్‌నగర్ కాలనీకు చెందిన విఠల్ (20), ప్రీతమ్ (14)లు దిచక్ర వాహనంపై మాటేగాం గ్రామానికి వెలుతుండగా నిర్మల్ వైపు నుంచి భైంసాకు వస్తున్న టిప్పర్ ఢీ కొట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరిని ప్రమాదస్థలి నుంచి 108 అంబులెన్స్‌లో ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో ప్రీతమ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విఠల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. భైంసా రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏరియా ఆసుపత్రి నిర్వహణ మెరుగుపరచాలి : కలెక్టర్


వైద్యాధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


కుభీర్ కస్తూర్బావిద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్

భైంసా, ఫిబ్రవరి 29 : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గాను భైంసా ఏరియా ఆసుపత్రి నిర్వహణ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరచాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సూచించారు. గురువారం భైంసాలో పర్యటించి ఆసుపత్రి నిర్వహణ తీరును పర్యవేక్షించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులలో కలియ తిరిగి పరిశీలించారు. ఇన్‌పేషెంట్ విభాగంలోని రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహణ వ్యవస్థకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బంది రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో సానిటేషన్ వ్యవస్థ పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి మెరుగుపరచాలని ఆదేశించారు. రోగుల సౌకర్యార్థం అవసరమైన వసతుల కోసం ప్రతిపాదనలు రూపొందించాలని పేర్కొన్నారు. నీటిఎద్దడి లేకుండా సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం ఆసుపత్రి పై భాగంలో ట్యాంక్ నిర్మాణం చేపట్టి మిషన్ భగీరథ ద్వారా నీటి సరపరా వ్యవస్థ కల్పించాలన్నారు. వెనుకభాగంలో వైద్య సిబ్బంది, రోగులకు సంబంధించి వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

ఉత్తమ మార్కులు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు

కుభీర్ : పది వార్షికపరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బగాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. తలుపులు, కిటికీలు, సీలింగ్‌ఫ్యాన్‌లు సక్రమంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మొరాయించిన సీలింగ్‌ఫ్యాన్‌లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి స్థలం కబ్జాలకు గురవుతోందని అక్రమంగా దుకాణాలను వేశారని గ్రామస్థులు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో ఆసుపత్రిని పరిశీలించేందుకు వెళ్లగా వారసంత ఉండడంతో వెనుదిరిగారు. కస్రా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట డీఆర్‌డీవో విజయలక్ష్మీ, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ హన్మండ్లు, డీఈవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సోము, ఎంపీడీవో శ్రీనివాస్, తదితరు లున్నారు.

అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

భైంసా రూరల్ : ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలో వందశాతం అమలు చేయాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం భైంసా ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ పరిధిలోని మండలాలకు సంబంధించి వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రత్యేకచర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇతర శాఖల అధికారుల, తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో



కుంటాల, ఫిబ్రవరి, 29: పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కల్లూరు కస్తుర్భాగాంధీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు సిబ్బంది హాజరు శాతం, మధ్యాహ్న భోజనం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందికి సూచించారు. త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో అధిక శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సిబ్బంది కృషి చేయడమే కాకుండా విద్యార్థులు కూడా కష్టపడి చదివి పాఠశాలకు పేరు తెచ్చే విధంగా ఉత్తీర్ణత శాతం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మతి స్థిమితం లేని

మహిళ ఆత్మహత్య


గంగాసాగర మృతదేహం

భైంసా రూరల్, ఫిబ్రవరి 29 : మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో గంగాసాగర అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మీర్జాపూర్ గ్రామానికి చెందిన గంగాసాగర(44) అనే మహిళ రెండు సంవత్సరాల క్రితం తన కుమారుడు పురుషోత్తం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో అప్పటి నుంచి ఆమె మతిస్థిమితం లేనట్లుగా ప్రవర్తించేది. కొడుకు లేని జీవితం వ్యర్థమని బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ్ముడు ధర్మపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రంజాన్ సందర్భంగా

సౌకర్యాలు కల్పించండి : కలాం గుణం సొసైటీ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 29 : రంజాన్ సందర్భంగా జిల్లాకేంద్రంతో పాటు మండల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలాం గుణం ఎడ్యుకేషన్ సొసైటీ గురువారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఉపవాస దీక్షకు ఆటంకాలు కలుగకుండా తాగునీరు, విద్యుత్, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మొహమ్మద్ ఉస్మాన్, మొహమ్మద్ బీన్ అలీ, షైక్ ఇంతియాజ్, మసూద్ ఖాన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రేపు ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సంఘ సమావేశం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 29 : ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం సర్వసభ్య సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు టీఎన్జీవో భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు డి. రాములు, ప్రధాన కార్యదర్శి పరమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 10న హైదరాబాద్‌లో జరిగే జాతీయ సదస్సు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

మట్టిలో రజితం



రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 29 : నిర్మల్ మండలం సీలాయిపేటకు చెందిన మట్టి రజిత రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించుకుంది. కొద్దిరోజుల క్రితం విడుదలైన గురుకుల పీజీటీలో టీచర్‌గా ఉద్యోగం సాధించింది. గురువారం వెలువడిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో జేఎల్‌గా ఉద్యోగం పొందింది. ఒకే నెలలో రెండు ఉద్యోగాలు రావడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య, ఉన్నత విద్య తెలంగాణ యూనివర్సిటీ, యోగి వేమన యూనివర్సిటీలో ఎంఏ, బీఈడీ పూర్తి చేసింది. భర్త కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో తాను కొలువులు సాధించినట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ గాండ్ల విలాస్, సాయన్న, రజితను అభినందించారు.

జిల్లా కేంద్రంలో

పద్మశ్రీ కనకరాజుకు చికిత్స

● జైనూరు నుంచి నిర్మల్ వరకు వచ్చి చికిత్స చేయించుకున్న గుస్సాడీ కళాకారుడు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 29 : కనకరాజు... అంటే సాధారణంగా ఎవరికీ తెలియదు. కానీ పద్మశ్రీ కనకరాజు అంటే టక్కున చెప్పేస్తారు. ఆదివాసీల అరుదైన గుస్సాడీ నృత్యానికి జాతీయస్థాయి గుర్తింపు తీసుకురావడంతో పాటు 2019లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. అలాంటి గొప్ప కళాకారుడు సామాన్యంగా వచ్చి చికిత్స చేయించుకున్నారు. ఆయనను గుర్తించిన ఆసుపత్రి యాజమాన్యం ఉచితంగా వైద్య సేవలందించడంతో పాటు ఘనంగా సన్మానించింది. ఈ వివరాలను జిల్లా కేంద్రంలోని ఒక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు గురువారం వెల్లడించారు. జైనూరు మండలం మార్లవాయికి చెందిన గుస్సాడీ కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు కొంతకాలంగా ఊపిరితిత్తులు, యూరాలజీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. తెలిసినవారి సమాచారంతో మూడు రోజుల క్రితం ఇక్కడి ఆసుపత్రికి వచ్చి చేరారు. ముందుగా ఆయనకు పరీక్షలు చేయగా, ఆపరేషన్ చేయాల్సిన అవసరమున్నట్లు జనరల్ సర్జన్లు గుర్తించారు. ఈ మేరకు వారు కనకరాజుకు ఆపరేషన్లు చేశారు. ఆసుపత్రి తరఫున కనకరాజుకు వైద్య సేవలన్నీ ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నిఖిల్, స్వప్న, జగన్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో గోడప్రతుల ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 29 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు అందుబాటులో ఉన్న కోర్సులకు సంబంధించిన గోడప్రతులను గురువారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ భీమ్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతోందన్నారు.

నర్సన్న బాపు సంతాపసభకు

హాజరైన గ్రామస్థులు

సారంగాపూర్, ఫిబ్రవరి 29 : జిల్లాకేంద్రంలో గల సాగర్ కన్వెన్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన స్వర్గీయ మాజీ మంత్రి పినర్సారెడ్డి (నర్సన్నబాపు) సంతాపసభకు మలక్ చించోలి గ్రామస్థులు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.